క్లుప్తంగా

శివాలయంలో హుండీ లెక్కింపు



హుండీలోని కానులను లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

ప్రొద్దుటూరు కల్చరల్ : శివాలయంలో భక్తులు స్వామివారికి సమర్పించిన హుండీ కానుకలను బుధవారం లెక్కించినట్లు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ శంకర్ బాలాజీ తెలిపారు. బుధవారం ఆరు నెలల కాలానికి భక్తులు స్వామికి సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.3,00,326 వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నంద్యాల దేవదాయశాఖ ఇన్స్పెక్టర్ శశికుమార్, పూజారులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

శ్రీనిధి డెయిరీ ప్రొడెక్ట్స్ ప్రారంభం



శ్రీనిధి డెయిరీని ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక టీబీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన శ్రీనిధి డెయిరీ ప్రాడెక్ట్స్‌ను బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి డెయిరీ ఎండీ రేగంటి సురేష్‌బాబు, డైరెక్టర్ నాగసాయి, జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, టీటీడీ మాజీ పాలక మండలి సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన




బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రొద్దుటూరు : పట్టణంలోని పవర్ హౌస్ రోడ్డు, స్వరాజ్య నగర్ సెక్టార్ల పరిధిలో బుధవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు శాంతకుమారి, లక్షుమ్మ మాట్లాడుతూ చిన్న వయసులోనే ఆడ పిల్లలకు వివాహం చేయడం ద్వారా ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని వివరించారు. ఆడ పిల్లకు 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు రమ్య, దేవి, స్వర్ణలత, సంధ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

అట్లూరు : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి క్రీడలలో ప్రతిభకనబరిచారని జీసీడీఓ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె అట్లూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. అయితే ఇటీవల అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలో మూడవ స్థానాన్ని కైవశం చేసుకుని కాంస్యపథకం సాధించిన పి.హారికను, సీనియర్ సాఫ్ట్‌బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చందనను, అండర్-19 విభాగంలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఆమె అభినందించారు.

క్రీడాపరికరాల వితరణ



విద్యార్థులకు ఆట వస్తువులను పంపిణీ చేస్తున్న రామకృష్ణారెడ్డి

కాశినాయన : చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమే అని వివేకానంద ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు పి.రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని వరికుంట్ల కస్తూర్బాగాంధీ పాఠశాలలోని బాలికలకు సంస్థ ఆధ్వర్యంలో క్యారంబోర్డులు, త్రోబాల్, వాలీబాల్, చెస్, స్కిప్పింగ్‌రోప్‌లు, షటిల్ వంటి ఆట వస్తువులను ఉచితంగా వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకురాలు రామతులసి, పాఠశాల ఎస్‌ఓ మెర్సీరాణి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు రైతులకు శిక్షణ శిబిరం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 29న శుక్రవారం ఉదయం 9 గంటలకు ఖాజీపేట మండలం సన్నపల్లెలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.వైకుంఠ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పశుధన్, జాగృతి అభియాన్, భారత ప్రభుత్వ పశు సంవర్ధకశాఖ ఆర్థిక సహాయంతో, జిల్లా పశుసంవర్ధకశాఖ సహకారంతో పశువులలో పునరుత్పత్తి, ఫలదీకరణపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసన్

ప్రొద్దుటూరు : ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలను బలోపేతం చేయాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. స్థానిక డీసీసీ బ్యాంకులో బుధవారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, దువ్వూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.1,62,523 కోట్లు కేటాయించిందన్నారు. ఈ నిధులను నాబార్డ్, ఎన్‌జీడీసీ, ఎన్‌డీడీపీ, ఎన్ఎఫ్‌డీబీ సంస్థల ద్వారా సహకార సంఘాలకు నిధులు అందిస్తారని చెప్పారు. సంఘం నిర్వహణలో సభ్యుల భాగస్వామ్యం అంతంత కీలకమని తెలిపారు. తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించి సకాలంలో చెల్లించాలన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా సభ్యులు బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప డీసీసీబీ సలహాదారుడు యు.సహదేవరెడ్డి, ఆప్కాబ్ వీరశంకర్ బాబు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ఎస్‌డీఎల్‌సీఓ అధికారులు ఎంవీ ప్రభాకర్ రావు, వి.బ్రహ్మానందా రెడ్డి, బ్రాంచి మేనేజర్ చెన్నకృష్ణారెడ్డి, చెన్నమరాజుపల్లె, పి.టంగుటూరు, వద్దిరాల సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా ఎంపికలు బుధవారంతో ముగిశాయి. రెండవ రోజు స్థానిక ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల ఇండోర్ స్టేడియంలో విద్యార్థులకు రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో వంటి క్రీడల్లో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ.వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికల్లో అన్ని క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆల్‌రౌండర్ ఛాంపియన్ షిప్ బద్వేలు బాలుర ఉన్నత పాఠశాల కైవసం చేసుకుందన్నారు. అలాగే అండర్-17 బాలుర విభాగంలో బెస్ట్‌ఇన్‌స్పోర్ట్స్ బద్వేలు బాలుర ఉన్నత పాఠశాల, అండర్-14 బాలుర విభాగంలో బెస్ట్‌ఇన్‌స్పోర్ట్స్ కలసపాడు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, అండర్-17 బాలికల విభాగంలో పెండ్లిమర్రి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, అండర్-14 బాలికల విభాగంలో అట్లూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల నిలిచాయన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి అని నిరూపించుకున్న సీఎం జగన్



పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి

ప్రొద్దుటూరు : బీసీ జనగణన చేయాలని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర పద్మశాలి కులస్తుల నుంచి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దాదాపు వందేళ్ల కింద దేశంలో బీసీ కుల గణన జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటిదాకా ఏ ప్రభుత్వం బీసీల గురించి ఆలోచించలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల ప్రాతిపదికన పరిపాలనలో భాగస్వామ్యం కల్పించి బీసీలకు ఎన్నో పదవులు ఇచ్చారని కొనియాడారు. ఇలాంటి ముఖ్యమంత్రికి యావత్తు బీసీలందరూ అండగా ఉంటారని తెలిపారు.

డీఏడబ్ల్యూ స్థలంపై కోర్టుకు వెళతాం



మాట్లాడుతున్న శివాలయం చైర్మన్ రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : డీఏడబ్ల్యూ కళాశాల స్థలం నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు వేసి అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నందున ఆ స్థలాన్ని శివాలయానికి స్వాధీనం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కోర్టుకు వెళతామని శివాలయం చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. బుధవారం శివాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో మహిళల విద్యాభివృద్ధి కోసం 1978-79 సంవత్సరంలో శివాలయం భూమిని ఎకరా రూ.10వేలతో 18.10 ఎకరాల స్థలాన్ని కొని డీఏడబ్ల్యూ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. కళాశాల అభివృద్ధి పేరుతో నిర్వాహకులు ఆ స్థలాన్ని అమ్మడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి ఇళ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారని తెలిపారు. స్థలం విక్రయించడంపై కోర్టులో విచారణలో ఉండగానే ఆ స్థలం ముగ్గురి చేతులు మారిందన్నారు. శివాలయం స్థలం ద్వారా కళాశాల నిర్వాహకులు భారీగా ప్రయోజనం పొందినందున శివాలయం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆలయ పాలకమండలి సభ్యులు గంగాధర్, గోవర్ధన్‌రెడ్డి, మల్లికార్జున శెట్టి, బి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

చాపాడు: మండలంలోని వెదురూరు గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఓబులేసు గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 15 రోజులకు ఒక సారి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి రోగాలు ఉన్న, జ్వరాలు వచ్చినా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న బెడ్‌కు పరిమితమైన రోగులను ఇంటి వద్దనే పరీక్షించి వైద్యం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : పాఠశాలలో విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలని డీఈఓ వై.రాఘవరెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ ఎ.ప్రభాకర్‌రెడ్డి, సేఫ్టీ ఆఫీసర్ రమేష్ తెలిపారు. స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో బుధవారం పాఠశాలల భద్రతపై నియోజకవర్గంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు వచ్చినప్పటి నుంచి ఇంటికి వెళ్లే వరకు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మండల స్థాయిలో ఒక కమిటీని, పాఠశాల స్థాయిలో ఒక కమిటీని నియమించాలన్నారు. పాఠశాలలో నాడు-నేడు పనుల కోసం తవ్విన గుంతల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని, గుంతలలో ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందకుండా కిరోసిన్ వేయాలని సూచించారు. నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని, శిథిలావస్థలో ఉన్న తరగతి గదుల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా రక్షణ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచడమే లక్ష్యం

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఆదాయం పెంచడంతో పాటు ఆర్టీసీని ప్రయాణికులకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతోనే గిఫ్ట్‌స్కీం విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బద్వేలు-కడప రూట్‌లో పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సులలో ఏర్పాటు చేసిన గిఫ్ట్‌స్కీం డిప్‌ను బుధవారం తీసి విజేతలకు బహుమతులను అందజేశారు. గిఫ్ట్‌స్కీంలో ఎం.సుబ్బారెడ్డి, యు.రామ్మోహన్, ఎల్.హరీష్‌లు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలో బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పెద్ద జమ్మయ్య ఆధ్వర్యంలో బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేడ బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానించి పార్లమెంట్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపారన్నారు. బేడ బుడగ జంగాలకు ఎస్సీ జాబితాలో చేర్చాలని తీర్మానించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోరాట సమితి సభ్యులు రామదాసు, పుల్లయ్య, బాలుడు, లాలు, చిన్నమారి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో నేరుగా ప్రవేశాలు

మైదుకూరు : మైదుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.గురుమూర్తిరెడ్డి తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ రాసినా, రాయకపోయినా పాలిటెక్నిక్ కళాశాలలో చేరవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఈఈఈ, మెకానికల్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, కెమికల్ ఇంజనీరింగ్, మెటలార్జికల్ ఇంజనీరింగ్ (లోహశాస్త్రం)లో బ్రాంచీలు ఉన్నాయని వివరించారు. నేరుగా అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు కూడా ప్రభుత్వ హాస్టళ్లలో వసతి ఉంటుందన్నారు.

నేడు ఆసారే షరీఫ్

కడప కల్చరల్ : మిలాద్ ఉన్ నబీ సందర్భంగా కడప నగరంలోని బగ్దాదియా నగర్‌లోని ఆస్తాన ఏ బగ్దాదియాలో గురువారం ఆసారే షరీఫ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తాన ఏ బగ్దాదియా అహలె సున్నత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు 'ఆసారే షరీఫ్' ఉంటుందని పేర్కొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



జాతీయ బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా గౌరవాధ్యక్షుడు సందు శివనారాయణ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లా గౌరవాధ్యక్షుడిలుగా సందు శివనారాయణ, రామేశ్వరం ప్రభుకుమార్, జిల్లా కన్వీనర్‌గా బి.వెంకటరమణరాజు, ప్రధాన కార్యదర్శిగా జింకా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా జింకా జయప్రకాష్, పి.సుధాకర్‌రాజు, సంయుక్త కార్యదర్శిగా బి.రమేష్‌రాజులను ఎన్నుకున్నామన్నారు. అలాగే రాష్ట్ర సెక్రటరీ జనరల్‌గా బి.వెంకటరమణ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కత్తి విజయకుమార్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

బద్వేలు అర్బన్ : క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని, దీని ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తిరుపతి ఎన్‌సీసీ-5 (ఎ) బెటాలియన్ సుబేదార్ ధర్మవీర్‌సింగ్ తెలిపారు. బుధవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఎన్‌సీసీ బాలికల విభాగానికి ఎంపికలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఫిజికల్, మెడికల్ పరీక్షల ఆధారంగా 33 మంది విద్యార్థినీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ సర్టిఫికెట్లు విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయని, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలలో సర్టిఫికెట్ ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పంటల సాగు



ట్రాక్టర్‌తో మినుము విత్తనం వేస్తున్న రైతులు



ముందస్తుగా సాగు చేసిన మినుము పంట

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు మినుము, పెసర పంటలను ముమ్మరంగా సాగు చేస్తున్నారు. కొంతమంది రైతులు విత్తనంతో పాటు ఎరువులు వేస్తున్నారు.

గతంలో వర్షాలు అధికంగా పడటం, మినుము, పెసర పంటలకు చీడపీడలు, పురుగులు, తెగుళ్లు ఆశించడంతో దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. ధరలు బాగుండటంతో ఈ ఏడాది అధిక దిగుబడులు రావాలని రైతులు కోరుకుంటున్నారు.

తెలుగుగంగ నీరు ఏటిపాలు



బొక్కినేరు వాగు వద్ద ఏటి పాలవుతున్న తెలుగుగంగ నీరు

కాశినాయన : బ్రహ్మంసాగర్ ఎడమ కాలువ ద్వారా వస్తున్న నీరు ఏటిపాలవుతున్నా తెలుగుగంగ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎడమ కాలువ ద్వారా కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ళ మండలాల్లోని చెరువులకు, ఆరుతడి పంటలకు నీరు అందుతుంది. ఈ నేపథ్యంలోనే గత 15 రోజుల నుంచి ఎడమ కాలువ ద్వారా పోరుమామిళ్ళ చెరువుకు నీటిని వదులుతున్నారు. అయితే అంబవరం నుండి కలసపాడు వరకు కాలువకు ఉన్న తూము గేట్లను మూసివేయకపోవడంతో నీరు వృథాగా సగిలేరు పాలవుతుంది. గేట్లను మూసివేస్తే పోరుమామిళ్ళ చెరువు వారం రోజులలోపు నిండిపోతుంది. అక్కడి నుంచి కాలువ ద్వారా గోపవరం మండలానికి నీరు చేరుతుంది. ఇప్పటికైనా తెలుగుగంగ అధికారులు స్పందించి ఎడమ కాలువకు ఉన్న తూము గేట్లను మూసివేయాలని ప్రజలు కోరుతున్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ళ మండలాల్లో రైతులు దాదాపు 15 వేల ఎకరాల్లో సజ్జ, మొక్కజొన్న పంటలను సాగు చేస్తారు. వీటికి తెలుగుగంగ ఎడమ కాలువ ద్వారానే ఆరుతడి పంటలకు నీరు అందిస్తారు. అధికారులు నీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

రోజూ రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలి



విద్యార్థిని దంతాలను పరీక్షిస్తున్న డాక్టర్

ప్రొద్దుటూరు కల్చరల్ : రోజూ రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలని దంత వైద్యులు కుముద, చక్రధర్ తెలిపారు. మండలంలోని తాళ్లమాపురం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు దంత పరీక్షలు చేసి దంతాలు పుచ్చిపోయిన వారికి, దెబ్బతిన్న వారికి ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, బాగా చదువుకోవాలని సూచించారు. మురుకూటి సూర్యనారాయణ రెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి ఉచితంగా విద్యార్థులకు టూత్‌పేస్ట్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గోపీనాథరెడ్డి, జేవీవీ జిల్లా కార్యదర్శి రాజేష్, ఎన్‌సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ డీవీ సుబ్బానాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఉన్నత విలువలు పెంపొందించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎస్.కల్పన

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థుల్లో ఉన్నత విలువలు పెంపొందించాలని రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎస్.కల్పన తెలిపారు. బుధవారం మండలంలోని తాళ్లమాపురం జెడ్పీ హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. లిప్ ప్రోగ్రాం 6, 7, 8 తరగతులలో బోధించే విధానాన్ని ఆమె పరిశీలించి విద్యార్థుల స్థాయిని పరీక్షించారు. ప్రభుత్వం అందించే జగనన్న విద్యాకానుకను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిక్షనరీ ద్వారా రోజూ పది కొత్త పదాలను నేర్చుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను నేర్చుకుని 10/10 జీపీఏ సాధించి ఐఐఐటీలో సీటు సాధించాలని సూచించారు. విద్యార్థులలో మంచి బోధనల ద్వారా, కథల ద్వారా విలువలతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపీనాథరెడ్డి, ఏఎంఓ ఎ.ధనలక్ష్మి, అసిస్టెంట్ ఏఎంఓ రామాంజనేయరెడ్డి, లిప్ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో జష్నే మిలాద్



ఆసారె షరీఫ్‌ను ప్రారంభిస్తున్న పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి

కమలాపురం : పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గాలో జష్నే మిలాదున్నబి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం రాత్రి దర్గా పీఠాధిపతి సజ్జాద్-ఏ-నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజన సందోహం నడుమ మిలాద్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి నివాసం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చిన పూల చాదర్లను స్వామి వార్ల మజార్లపై సమర్పించి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన దాదాపు 100కు పైగా వస్తువులను ప్రదర్శనకు (ఆసారే షరీఫ్) ఉంచారు. భక్తులు వాటిని చూసేందుకు ఆసక్తి చూపారు. అనంతరం రాత్రి నిర్వహించిన బయాన్‌లో భక్తులను ఉద్దేశించి పీఠాధిపతి మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జననం, మరణం ఒకే రోజు జరిగాయని, ఆ రోజునే మనం మిలాదున్నబిగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దస్తగిరి స్వామి, మౌలానా స్వామిలు మిలాద్ ప్రత్యేకతను వివరించారు. అనంతరం భక్తులకు గఫారియా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



చాపాడు: ముఖ్య పుణ్యక్షేత్రమైన మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి సన్నిధిలో కొలువుదీరిన వినాయకుడిని బుధవారం సాయంత్రం నిమజ్జనం చేశారు. వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని వీరభద్రస్వామి సన్నిధిలో వినాయకుడిని ప్రతిష్ఠించారు. తొమ్మిదవ రోజు పురస్కరించుకుని బుధవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి కుందూనదిలో నిమజ్జనం చేశారు.